రేషన్ షాపులకు సన్న బియ్యం

పేదలకు పంపిణీ చేసేందుకు యంత్రాంగం సన్నాహాలు

పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టను న్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి ఆహార భద్రత కార్డు ఉన్న వారికి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి పక్క జిల్లాల్లోని మండలస్థాయి గోదాముల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా రేషన్ దుకాణాల్లోకి చేరవేసే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని అర్బన్ ప్రాంతాలకు ప్రతినెలా రేషన్ పంపిణీ ఆలస్యం అవుతోంది. అన్నిచోట్లా నెల ప్రారంభం నుంచి సరకులు ఇస్తుండగా.. కొన్ని పురపాలక సంఘాల్లో మాత్రం రెండో వారం ప్రారంభిస్తున్నారు. ఈ సారి కూడా ఆలస్యం చేస్తారా.. అనుకున్న సమయానికి పంపిణీ చేస్తారా? అనేది చూడాల్సి ఉంది. రేషన్ కార్డులో ప్రతి సభ్యుడికి ఉచితంగా ఆరు కిలోలు అందజేస్తారు. -సాక్షి, సిటీబ్యూరో

- ఉగాది కానుకగా.. ఏప్రిల్ నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీ
- రేషన్ బియ్యం అక్రమ రవాణా అడ్డకట్టకు చర్యలు
- గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు తరలించేందుకు కసరత్తు
- 5.23 లక్షల ఆహార భద్రతా కార్డు దారులకు 10,640 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం



బయటి మార్కెట్లో సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఇది వరకు రేషన్ దుకాణాల్లో ఇచ్చే దొడ్డు బియ్యం అమ్మేసి ఆ డబ్బులతో సన్న బియ్యం కొనుగోలు చేసే వారు. దీంతో రేషన్ బియ్యం పక్కదారి పట్టేది తాము అధికారంలోకి వస్తే సన్న బియ్యం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఏడాది దాటిన తర్వాత సన్న బియ్యం పథకం అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ ప్రక్రియతో అక్రమాలకు చెక్ పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా..

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నాయి. అందులో భాగంగా పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసరాలు అందించేందుకు రేషన్ దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందిస్తున్నారు. దొడ్డు రకం బియ్యం తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపకపోవడం, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

అక్రమాలకు అడ్డుకట్ట

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో చాలా కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తుండటంతో.. దొడ్డు బియ్యం అక్రమార్కులకు వరంలా మారుతోంది. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు చేస్తూ.. రూ.లక్షల్లో అక్రమ దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల అధికారులే అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, పలువురు రేషన్ డీలర్లు కూడా వంతపాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని రిసైక్లింగ్ చేసి తిరిగి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం అక్రమ దందాను నిలువరించేందుకే సన్నబియ్యం పంపిణీ చేస్తోంది.

5.23 లక్షల మందికి కార్డులు

మేడ్చల్ జిల్లాలోని 619 రేషన్ దుకాణాల ద్వారా 5,23,938 రేషన్ కార్డు దారులకు ప్రతి నెలా ఉచితంగా ఒకరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందులో 17,18,351 మంది లబ్ధిదారులు(యూనిట్లు) ఉండగా, ఒకరికి 6 కిలోల చొప్పున 10640.052 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు. ఉగాది కానుకగా.. ఏప్రిల్ నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం అందించేందుకు సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నేడు చికెన్ వేస్టేజ్ వేలంపాట

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో 2025–2026 సంవత్సరానికి చికెన్ వేస్టేజ్ వేలం పాటను శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నాగమణి తెలిపారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు వేలం పాటలో పాల్గొనదలచిన వారు దరఖాస్తు ఫీజు రూ.5 వేలు, దారవత్తు రూ.4.5 లక్షలు చెల్లించి ఉదయం 11 గంటలకు వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

విజేత కేపీఆర్ఐటీ కబడ్డీ క్రీడాకారులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న యాజమాన్యం, అధ్యాపకులు

ఘట్‌కేసర్: కేజీ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయస్థాయి క్రీడా ఉత్సవంలో ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(కేపీఆర్ఐటీ) మహిళల కబడ్డీ జట్టు విజేతగా, వాలీబాల్‌లో రన్నరప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా కేపీఆర్ఐటీ చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్ కుమార్, ప్రిన్సిపల్ శ్రీనాథ్ కశ్యప్, శ్రీనివాస్‌రెడ్డి విజేతలను కళాశాలలో శుక్రవారం కార్యక్రమంలో అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేపీఆర్ఐటీలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో పరిశోధనలకు ఉపయోగపడే నైపుణ్యం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇస్రోకు చెందిన భారతీయ దూర సంపర్క సంస్థ(ఐఐఆర్ఎస్) అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థులు, అధ్యాపకులు రిమోట్ సెన్సింగ్, జీఐఎస్, జీఎన్ఎస్ఎస్, జియోస్పేషియల్ టెక్నాలజీ వంటి అంశాలపై అవగాహనతో కూడిన శిక్షణ పొందారు. ఇస్రో–ఐఐఆర్ఎస్ ఎక్సలెన్స్ సర్టిఫికెట్లను శుక్రవారం విద్యార్థులు, అధ్యాపకులకు ప్రదానం చేశారు. విద్యార్థులు శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలు భవిష్యత్తులో పరిశోధనలు, అంతరిక్ష పరిశోధన, డేటా విశ్లేషణ, సాంకేతిక అభివృద్ధికి దోహదపడతాయని కళాశాల సెక్రటరి టీవీ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్‌రూరల్: ఇటీవల గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనమైన గౌడవెల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పలు అభివృద్ధి పనులను చేపట్టాలంటూ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో విద్యుత్ దీపాలు, వ్యాధులు సోకకుండా ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, సీసీ రోడ్లు వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టాలంటూ నాయకులు కమిషనర్‌కు విన్నవించారు. మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి ముదిరాజ్, గ్రామ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, నాయకులు భగవాన్‌దాస్, విష్ణు, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పావనీయాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 11వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గుంతల రోడ్డుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న స్థానికులు విన్నపం మేరకు గత కౌన్సిల్ నిధులు కేటాయించింది. కార్యక్రమంలో మాజీ చైర్ పర్సన్ పావనీయాదవ్, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, జంగయ్యయాదవ్, శ్రీనివాస్, రాజా స్థానికులు పాల్గొన్నారు.

హక్కులపై చైతన్యం కల్పించాలి

మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే దిశగా కార్యచరణ రూపొందించాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ అధ్యక్షతన శుక్రవారం జైబాపు జైభీమ్, జై సంవిధాన్‌పై జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేయగా కేంద్రం చరిత్రను వక్రీకరించే యత్నం చేస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణముదిరాజ్, నాగరాజు ముదిరాజ్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ వెంకటేశ్ ముదిరాజ్, మాధవ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ అంజిరెడ్డి, జంగయ్యయాదవ్, అమర్, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు మల్లేశ్, దాసు, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రమేశ్, రాజు, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న పావనీజంగయ్య, ముత్యాలుయాదవ్

ప్రభుత్వ సీలింగ్ భూమి స్వాధీనం

బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ రెవెన్యూ పరిధిలోని 68.39 ఎకరాల సీలింగ్ భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సర్వే నంబర్ 153, 154, 155, 210, 218, 219లోని సీలింగ్ భూమిని గతంలో 24 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కేటాయించింది. స్థానిక దళితులు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వం అందజేసింది. వ్యవసాయం చేయకుండా ప్రభుత్వం ఇచ్చిన సీలింగ్ భూమిని రియల్టర్లకు విక్రయించగా ప్లాట్లుగా చేసి ఇతరులకు విక్రయించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా వారు స్పందించలేదు. దీంతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ సీలింగ్ భూమిలో బోర్డును ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు.



ప్రభుత్వ సీలింగ్ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోండి



శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ కోరారు. మహిళలకు కుట్టు మిషన్లు, కిరాణ షాపు, బ్యాంగిల్ స్టోర్, బ్యూటీపార్లర్‌తో పాటు పురుషులకు ఫొటో స్టూడియో, డీజిల్ ఆటో, ఎలక్ట్రిక్ ఆటో, లైట్ సెట్టింగ్, సౌండ్ ఆపరేటర్, ఏదైనా వృత్తి, ఇతర అవకాశాలు ఉన్నాయని, కార్పొరేషన్ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నైట్ బజార్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్ సిటీలోని శిల్పారామం(నైట్ బజార్)లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో మహిళా గ్రూపులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, మెప్మా పీడీ అనిల్ పాల్గొన్నారు.



సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం పెంచుకోవాలి



పోచారం: ప్రస్తుత సమాజంలో ఉన్న ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాలను సాధించాలని మాజీ కమాండర్ సంతోష్ నాగరాజన్ విద్యార్థులకు సూచించారు. చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'పరంపర–2025' పేరుతో శుక్రవారం నిర్వహించిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే సాంకేతిక, పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సమాజంలోని పలు సవాళ్లకు పరిష్కారాలను కనిపెట్టే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎన్ఆర్‌జీ వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డా.సీవీ కృష్ణారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ డా.టీ.రవీంద్రారెడ్డి, ఫార్మసీ డీన్ డా.జనార్దనరాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కే.శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించిన వ్యక్తిపై కేసు

పోచారం: రోడ్డు ఆక్రమించిన వ్యక్తిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. నారపల్లిలోని దివ్యానగర్ నుంచి ఏకశిలానగర్‌కు వెళ్లే రోడ్డును మల్లారెడ్డితో పాటు కొందరు వ్యక్తులు మూసివేయడంతో హైడ్రా పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సైదులు పోచారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. జనవరి 25వ తేదీన రోడ్డుపై ఉన్న ఆక్రమణలను హైడ్రా తొలగించినప్పటికీ, దారి ఇవ్వకుండా అడ్డంకులు సృష్టిస్తున్న వ్యక్తులపై హైడ్రా అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హన్మంత్‌రెడ్డి



మేడ్చల్: మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన సీనియర్ న్యాయవాది హన్మంత్ రెడ్డి విజయం సాధించారు. మేడ్చల్ కోర్టు ఆవరణలో శుక్రవారం జరిగిన బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలలో మేడ్చల్‌కు చెందిన చీదు హన్మంత్‌రెడ్డి విజయం సాధించారు. వరుసగా రెండోసారి ఆయన మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా విజయ్‌గోపాల్‌రావు విజయం సాధించారు.

రైతు బజార్‌లో చట్టాలపై అవగాహన



ఘట్‌కేసర్: రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు అంబేద్కర్‌నగర్‌లో శుక్రవారం జరిగిన కూరగాయల వారం సంతలో ఇన్‌స్పెక్టర్ పరుశురాం సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు పోలీస్ శాఖ కల్పిస్తున్న భద్రత, నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. నేరాలు తగ్గించడంలో పోలీసులకు ప్రజల సహకారం కోరారు.

కాంగ్రెస్‌లోకి సంస్కృతి టౌన్‌షిప్ ప్రతినిధులు



సాక్షి, సిటీబ్యూరో: పోచారం పురపాలక సంఘం పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌కు చెందిన పలువురు అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి ఇందిరా ప్రియదర్శిని, కార్యవర్గ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ విమల, సుప్రజ, దిలీప్ చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో టౌన్‌షిప్‌కు గేటెడ్ కమ్యూనిటీ హోదా కల్పిస్తామన్నారు. ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శ్రీగిరి వెంకట్ మాధవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బద్దం వెంకట్‌రెడ్డి, శ్యామల శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ముదిరెడ్డి రాజేష్‌రెడ్డి, మెట్టు నర్సింహారెడ్డి, ఇటికల కృష్ణారెడ్డి, యుగేందర్‌రెడ్డి, బద్దం నర్సింహరెడ్డి, నరేష్‌గౌడ్, రాజు, హేమంత్, చంద్రకాంత్, మెట్టు గణేష్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తు నమోదు గడువు పెంపు

ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల నమోదు కోసం 2024–25 విద్యా సంవత్సరం (ఫ్రెషర్స్ అండ్ రెన్యూవల్) దరఖాస్తు చేసుకునేందుకు మే 31 వరకు గడువు పొడిగించినట్లు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ వినోద్ కుమార్ తెలిపారు. అర్హతగల విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సంబంధిత ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల యజమాన్యం, ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల్లో అర్హత కలిగిన విద్యార్థులను పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రపంచ గమనాన్ని మార్చే దిశగా ఏఐ

మేడ్చల్: ఇంజినీరింగ్ విద్య కేవలం ఒక కోర్సు కాదని, భవిష్యత్తును మలిచే ప్రమాణం అని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లోని ఎమ్మార్‌సీఎం కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య ఎంతో విలువైందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేడు ప్రపంచ గమనాన్ని మార్చే దిశగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో కల్నల్ నరేందర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, అడ్వయిజర్ సత్యనారాయణ, సెక్రటరి క్రిష్టారెడ్డి, డైరెక్టర్లు సుబ్బరత్నం, రాఘవేందర్‌రెడ్డి, భరత్‌సింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలకిష్టారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

యువ వికాసం.. ఉపాధికి సోపానం

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి రాజీవ్ యువ వికాసం పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 18 నుంచి 35 ఏళ్ల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలు పంపిణీ చేయనుంది. మూడు కేటగిరీల్లో అర్హతను బట్టి ఒక్కో నియోజకవర్గానికి నాలుగు వేల నుంచి ఐదు వేల మంది యువతకు లబ్ధి చేకూరేలా ప్రణాళికలను రూపొందించింది. కొన్నేళ్లుగా స్వయం ఉపాధి రుణాలు నిలిచిపోవడంతో నిరుద్యోగులు డబ్బులేక సొంతంగా వ్యాపారం చేయడానికి ముందుకు రాలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం ద్వారా అవకాశం కల్పిస్తుండటంతో మళ్లీ వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. కానీ కొందరు కులం, ఆదాయం ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. -జవహర్‌నగర్

- దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 5 చివరి తేదీ
- రద్దీగా ఇంటర్‌నెట్, మీ సేవ కేంద్రాలు



రేషన్‌కార్డు సమస్య..

గతంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందిన వారి దరఖాస్తులను వెబ్‌సైట్ తీసుకోవడంలేదని, ప్రభుత్వ సహాయం పొంది ఏడేళ్లలోపు అయిన లబ్ధిదారుల దరఖాస్తులు నమోదయ్యే అవకాశం లేదని ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. రేషన్‌కార్డు ఉంటే అందులో ఒక సభ్యుడికి మాత్రమే ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉంటుంది. దీంతో చాలా మందికి రేషన్‌కార్డుల సమస్య ఉండటం, ఉమ్మడి కుటుంబంలో పేర్లు నమోదు చేసుకోవడంతో చాలా మంది దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడంలేదు.

మూడు విభాగాలుగా..

అర్హత కలిగిన వారు ఇంటర్ నెట్‌లో, మీ సేవ కేంద్రాలు, ఫోన్లలో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని రేషన్‌కార్డు, ఆదాయ కుల ధ్రువపత్రాల వివరాలతో పాటు పాన్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత వ్యక్తి ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఎంచుకున్న రంగంలో మూడు రుణాలు అందిస్తారు. మొదటి విభాగంలో రూ.లక్షకు 80శాతం రాయితీ, మిగిలిన 20శాతం బ్యాంకు రుణం ఇస్తుంది. రెండో విభాగంలో రూ.2 లక్షలకు 70శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం, మూడో కేటగిరిలో రూ.3 లక్షలకు 60 శాతం రాయితీ పోనూ మిగిలింది బ్యాంకు అందజేస్తుంది.

యువతకు స్వయం ఉపాధి అవకాశం



కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువతకు మంచి అవకాశం కల్పిస్తోంది. స్వయం ఉపాధితో వ్యాపారం చేసుకునే యువత ముందుకు రావాల్సిన అవసరం ఉంది. కేటగిరీలను బట్టి మూడు విభాగాలుగా ఆర్థిక సాయం పొందవచ్చు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎలాంటి పక్షపాతం లేకుండా అధికారులు ఎంపిక చేస్తారు.

– మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, కాంగ్రెస్ అధ్యక్షుడు, జవహర్‌నగర్ కార్పొరేషన్

లబ్ధిదారులలో పారదర్శకత పాటించాలి



రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఏ మాత్రం పక్షపాతం చూపించవద్దు. పారదర్శకంగా అర్హుల ఎంపిక ఉండాలి. వ్యాపారం చేసుకునేందుకు యువతకు అవకాశం కల్పించాలి. క్షేత్రస్థాయిలో నిజమైన అర్హులను గుర్తించాలి. దాంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి.

– టి.మహేందర్, తెలంగాణ యూనివర్సిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

వచ్చేనెల 5 వరకు అవకాశం..

దరఖాస్తులు చేసుకునే వారికి ఏప్రిల్ 5 వరకు అవకాశం ఉంది. ఏప్రిల్ 6 నుంచి మే 31వ తేదీ వరకు పరిశీలన చేస్తారు. జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించనున్నారు.